ప్రజాశక్తి

శుక్రవారం 11 నవంబర్ 2022

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

'ఉక్కు'పై ప్రకటన చేయాల్సిందే..

- ప్రయివేటీకరణకు సిద్ధపడితే మోడీని ప్రజలు గద్దె దించడం ఖాయం
- ప్లాంట్ పరిరక్షణకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నరసింగరావు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ 12న జరుగనున్న బహిరంగ సభలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోమని స్పష్టంగా ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి ఆగిపోతే నష్టమని అన్నారు. సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి మోడీపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండేలా కృషి చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేయకపోతే ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు కర్మాగారం గత ఏడాది సుమారు రూ.928 కోట్లు లాభాలు ఆర్జించి, రూ.28 వేల కోట్లు టర్నోవర్ సాధించిందని, ఈ ఏడాది అమ్మే కుట్రలో భాగంగా ప్లాంట్‌ను బిజెపి



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, పక్కన ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, మస్తానప్ప

సర్కారు బలహీనపరిచి బ్లాస్ట్ ఫర్నేస్‌లు పనిచేయనివ్వకుండా చేసిందని అన్నారు. రా మెటీరియల్ ఇవ్వకుండా చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పోరాట కమిటీ మరో ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు వల్ల ఏళ్ల తరబడి 25 లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రపంచంలో ఏ పరిశ్రమ అయినా సిక్ అయితే ఇంకా తేరుకోలేదని, స్టీల్‌ప్లాంట్ విషయంలో బిఐఎఫ్ఆర్‌కు వెళ్లినా మరలా నిలదొక్కుకుందని అన్నారు. కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వల్లే రాష్ట్రానికి అత్యధిక ఆదాయం లభిస్తోందన్నారు. కేంద్రం విభజన హామీలైన బయ్యారం, కడపలో మిగతా 2లో..



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయసాయిరెడ్డి, అమర్‌నాథ్

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు

3 లక్షల మంది వస్తారని అంచనా : విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి – ఎంవిపి కాలనీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిల బహిరంగ సభ రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిందని, సుమారు రూ.15 వేల కోట్లతో రాష్ట్రంలో పలు ప్రాంతాలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఈ నెల 12న ఉంటుందని రాజ్యసభ సభ్యులు, వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఎయు ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండులో ఈ నెల 12న జరగనున్న ప్రధాని బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి వైవి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బహిరంగ సభకు సంబంధించి ఇంచుమించుగా ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని అన్నారు. 30 ఎకరాల స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని, 3 లక్షల మంది హాజరు కానున్నారని అన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 2 లక్షల మంది, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి జిల్లాల నుంచి మరో లక్ష మంది సభకు హాజరవుతారని చెప్పారు. 11వ తేదీ సాయంత్రం ప్రధాన మంత్రి విశాఖ చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మిగతా 2లో..

కార్మిక నేత గోపాలరావుకు ఘన నివాళి

▶ వార్త 2లో..

ఎన్ఎడిబి వద్ద కొనసాగుతున్న ఆందోళన

▶ వార్త 5లో..

భూ కుంభకోణాలపై సిబిఐకి ఫిర్యాదు చేస్తాం

▶ వార్త 2లో..



నల్ల బ్యాడ్జీలను చూపుతున్న స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌లో డిమాండ్స్ డే

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన కార్మికులు వార్త మెయిన్‌లో..

'ఉప్పుటేరు'పై వీడని అనుమానాలు

- కంపెనీ వాహనంలో ఇఇ పరిశీలన
- హెటిరో యాజమాన్యాన్ని రక్షిస్తున్నారంటూ విమర్శలు
- ఆందోళనలో బాధిత మత్స్యకారులు

ప్రజాశక్తి – అనకాపల్లి ప్రతినిధి

శుద్ధి చేయకుండా వ్యర్థ రసాయనాలను ఉప్పుటేరులోకి విడిచిపెట్టిన హెటిరో డ్రగ్స్ యాజమాన్యాన్ని కాపాడే పనిలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత నెల 13, 18న హెటిరో కంపెనీకి ఆనుకొనివున్న ఉప్పుటేరులోకి రసాయనాలను విడిచి పెట్టడంతో కొన్ని టన్నుల చేపలు చనిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆరోపణలకు బలం చేకూరేలా వున్నాయి. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలతో చేపలు చనిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి, శాంపిల్స్ తీసుకెళ్లిన కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుదర్శన్ ఇంత వరకూ చేపలు చనిపోవడానికి కారణంగానీ, శాంపిల్స్ నివేదికనుగానీ బయటపెట్టలేదు. లక్షల



హెటిరో కంపెనీ వాహనంలో వచ్చి పరిశీలన జరుపుతున్న ఇఇ సుదర్శన్ (ఫైల్ ఫొటో)

రూపాయల విలువజేసే చేపలు చనిపోయాయని మత్స్యకారులు బాధపడు తుంటే, వారికి భరోసా కల్పించాల్సిన ఆయన హెటిరో యాజమాన్యం వాహనంలో సిబ్బందిని తీసుకొని పరిశీలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కంపెనీ మిగతా 2లో..

కార్మిక నేత గోపాలరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ బిహెచ్‌పివి నక్షత్రాలలో ఒక నక్షత్రం కార్మిక నేత టి.గోపాలరావు అని, ఆయన మృతితో ఒక నక్షత్రం రాలిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. గురువారం ఉదయం 7.30 గంటలకు కేర్ హాస్పిటల్‌లో గుండె ఆపరేషన్ అనంతరం గోపాలరావు మృతిచెందారు. ఆయన బిహెచ్‌పివి మాజీ ఉద్యోగి, సిపిఎం ఫ్యాక్టరీ కమిటీ సభ్యులు. సిపిఎం శాఖ కార్యదర్శిగా, బిహెచ్‌పివి యూనియన్ ఆఫీస్ బేరర్‌గా, కో-ఆపరేటివ్ డైరెక్టర్‌గా బహుముఖ బాధ్యతలు నిర్వహించారు. ఆకర్షణీయంగా ఉండే ఆయన అక్షరాలతో కొన్ని దశాబ్దాలు ఆయన రాసిన సర్క్యులర్లు నోటీస్ బోర్డులో వుండేవి. చిత్రకారుడు పావెల్ సహచరుడుగా కొన్ని దశాబ్దాలు గోడల మీద రాతలు రాయడంలో భాగస్వామి అయ్యారు. గురువారం ఆయన మరణించడంతో సంతాప సభ నిర్వహించారు.

ఈ సభలో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ నాణాలు గలగల ఆడుతాయని, నోట్లు మాత్రం నిశ్శబ్దంగా ఉంటాయని అన్నారు. అలాగే గోపాలరావు మితభాషిగావున్నా, పనులు ఎక్కువ చేసేవారని కొనియాడారు. సభకు సిపిఎం సీనియర్ నేత ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షత వహించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, బిహెచ్‌పివి మాజీ ప్రధాన కార్యదర్శి జి.స్వామినాథం, హిందుస్థాన్ షిప్‌యార్డ్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి యువిఎస్ఎన్.వర్మ, బిఎంఎస్ నాయకులు సిహెచ్ఎస్ఎన్.రాజు, సిద్ధార్ధ నగర్ కాలనీ నాయకులు సూర్యనారాయణ, డి.పార్వతీశం, జె.కోటేశ్వరరావు, వై.ఖాదర్, ఎన్.రాజేంద్రప్రసాద్, వై.సత్యవతి తదితరులు గోపాలరావు మృతిపట్ల సంతాపం తెలియజేశారు.

మొదటి పేజీ తరువాయి..

'ఉక్కు'పై ప్రకటన చేయాల్సిందే..

స్టీల్‌ప్లాంట్‌లకు మొండిచేయి చూపి, ఉన్న వైజాగ్‌ను లేపెయ్యాలని చూడడం దారుణమన్నారు. విశాఖ వచ్చి ప్రకటన చేయకుండా మోడీ వెనక్కి వెళితే తమ భవిష్యత్తు పోరాటాలకు మోడీయే బాధ్యత వహించాలని హెచ్చరించారు. నాయకులు మస్తానప్ప మాట్లాడుతూ మోడీ ఒక్క పరిశ్రమను నిర్మించకుండా ఉన్నవాటిని ధ్వంసం చేస్తున్నాడని మండిపడ్డారు. శుక్రవారం స్టీల్ కార్మికులు మాస్ లీవ్ పెట్టి ఆందోళనలో పాల్గొంటారని తెలిపారు. కుటుంబాలతో సహా రోడ్లెక్కి ప్రైవేటీకరణ విధానాలపై పోరాడతామన్నారు. వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 95 ఉన్నత స్థాయి పోస్టులు, 7500 ఉద్యోగాలు ప్లాంట్‌లో ఖాళీగా ఉన్నా నింపడం లేదని అన్నారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. హెచ్ఎంఎస్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'ఉప్పుటేరు'పై వీడని అనుమానాలు

వాహనంలో రావడంపై మత్స్యకారులు తీవ్ర నిరసన వ్యక్తంచేసి ఆయన్ను నిలదీశారు. దారి తెలియక కంపెనీ వాహనంలో వచ్చానని ఇది చెప్పడం యాజమాన్యాన్ని రక్షించడానికి చేస్తున్న ప్రయత్నమేనని మత్స్యకారులు అంటున్నారు. చేపలు చనిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి, కంపెనీ ప్రతినిధులతో కలిసి కంపెనీ లోపలకు వెళ్లడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అక్టోబర్ 18న చేపలు చనిపోయిన ప్రాంతంలో ఉప్పుటేరు నీరు, చనిపోయిన చేపల శాంపిల్స్ తీసుకెళ్లి ఇంతవరకూ నివేదిక రాలేదని దాటవేస్తున్నారని మత్స్యకారులు విమర్శిస్తున్నారు. నివేదిక విషయమై ఇటీవల 'ప్రజాశక్తి' కొద్ది రోజుల క్రితం సంప్రదించినప్పుడు నివేదిక రావడానికి సమయం పడుతుందని సమాధానం దాటవేశారు. గురువారం ఆయన ఫోన్‌కు స్పందించలేదు. నివేదిక జాప్యానికి పిసిబి అధికారుల ఉద్దేశపూర్వకంగా చేస్తున్న నిర్లక్ష్యమేనన్న విమర్శలు ఈ ప్రాంతంలో వినిపిస్తున్నాయి. ఎంతోకాలంగా పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడుతున్న హెటిరో యాజమాన్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తీసుకున్న చర్యలేమీ లేకపోగా, వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలనే మూటగట్టుకున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) నియమించిన సంయుక్త కమిటీ ఐదు నెలల క్రితం హెటిరో యాజమాన్య పర్యావరణ ఉల్లంఘనలను తన నివేదికలో పేర్కొంది. పర్యావరణ హానిని లెక్కగట్టి అపరాధ రుసుము విధించాలంటూ తీవ్రంగా స్పందించింది. ఎప్పటికప్పుడు పర్యావరణ పద్ధతుల పాటింపును పరిశీలించి, లోపాలు సరిచేసి.. అవసరమైతే చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు లోపాలను గుర్తించకపోవడం గమనార్హం. హెటిరో యాజమాన్యానికి సహకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సుదర్శన్‌పై చర్యలు తీసుకోవాలని గత నెల 25న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్ వినతిపత్రం ఇచ్చారు. దీనిపైనా అధికార యంత్రాంగం స్పందించలేదు.



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు

అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ ఇది ఏ రాజకీయ పార్టీకీ సంబంధించిన కార్యక్రమం కాదని, దయచేసి దీన్ని రాజకీయ కోణంలో చూడవద్దని కోరారు. సమయం తక్కువగా ఉన్నందున, కోర్టులో అడ్డంకులన్నీ తొలగిపోయినప్పటికీ భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపన వీలు కావడం లేదని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వైసిపి మొదటి నుంచి వ్యతిరేకమేనని, ఈ మేరకు ధర్నాలు, పాదయాత్రలు నిర్వహించామని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ 125 మంది ఎంపీల సంతకాలతో ప్రధానికి వినతిపత్రం ఇచ్చామని గుర్తుచేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు, జివిఎంసి కమిషనర్‌తో ఏర్పాట్లను పరిశీలించిన విజయసాయి రెడ్డి, సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌లు అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యన్నారాయణ, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి కెకె.రాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సు రామారావు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కాం నిందితులను కాపాడేందుకు తంటాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎంపీ విజయసాయిరెడ్డి అల్లుడు శరత్ రెడ్డిని ఇడి అరెస్ట్ చేసిన నేపథ్యంలో అతన్ని, అతనితోపాటు ఉన్న వారిని రక్షించేందుకు ఎంపీ విజయసాయిరెడ్డి తంటాలు పడుతున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ అన్నారు. ప్రధాని మెప్పు పొందేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నజీర్ మాట్లాడుతూ విజయసాయిరెడ్డి విశాఖలోనే తిష్ట వేసి ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని, ఇదంతా అతన్ని ప్రసన్నం చేసుకునేందుకేనని అన్నారు. సమావేశంలో పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు బైరెడ్డి పోతన రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి నడిగట్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ కుంభకోణాలపై సిబిఐకి ఫిర్యాదు చేస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ విశాఖలో జరుగుతున్న భూకుంభకోణాలపై త్వరలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఇడిలకు ఫిర్యాదు చేస్తామని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధరేశ్వరి పేర్కొన్నారు. ప్రధాని విశాఖ పర్యటన నేపథ్యంలో పార్టీ నగర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూఆక్రమణలకు, దందాలకు విశాఖ కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వ్యతిరేకుల కట్టడాలను కూల్చివేయడం, తీసివేయడంపై జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వున్న శ్రద్ధ పరిపాలనపై లేదని ఎద్దేవా చేశారు.

దసపల్లా భూములను అప్పనంగా కాజేసారని విమర్శించారు. బిజెపి రాజ్యసభ సభ్యుడు సిఎం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కంటే విధ్వంసం మీదనే ఎక్కువగా దృష్టి పెట్టిందన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, బిజెపి నగర అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, విష్ణు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సిపిఎం నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శించడానికి వెళ్లిన సిపిఎం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన కేసును గురువారం కోర్టు కొట్టివేసింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2020లో ఎల్‌జి పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినప్పుడు అనేక మంది గాయపడ్డారు. ఆ సమయంలో కెజిహెచ్ రాజేంద్ర ప్రసాద్ వార్డులోవున్న క్షతగాత్రులను పరామర్శించడానికి వెళ్లిన సిపిఎం నాయకులు డాక్టర్ బి.గంగారావు, ఎం.సుబ్బారావు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావులపై అక్రమంగా వన్ టౌన్ పోలీసులు కేసులు బనాయించారు.

కోర్టులో కేసులు నడిపారు. రెండు సంవత్సరాల పాటు లాయరు పూర్ణిమ కేసును వాదించారు. వీరిపై అక్రమంగా పెట్టిన కేసులను కొట్టివేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

పోలీస్, ఎస్ఐ, హైకోర్టు ఉద్యోగాలకు శిక్షణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎపి హైకోర్ట్, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ అందించనున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి లాభాపేక్షా లేకుండా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. పాల్గొనాలనుకున్న యువత https://bit.ly/3G1NgEW లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9315014015ను సంప్రదించాలన్నారు.

హేతువాదులపై దాడులు హేయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒడిశాలోని భువనేశ్వర్‌లో హియా అకాడమీలో చంద్ర గ్రహణం రోజున మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న హేతువాదులు, నాస్తికులపై భజరంగదళ్ కార్యకర్తలు భౌతికంగా దాడి చేసి గాయపరచడం దుర్మార్గమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి. శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. గ్రహణం రోజున ఆహారం తినడం వల్ల ఇబ్బందులు ఉండవని, అది మూఢ విశ్వాసమని ఒడిశాలోని పలు ప్రాంతాల్లో హేతువాదులు వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించగా, కొన్నిచోట్ల భజరంగదళ్ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారని తెలిపారు.

విభజన హామీలపై మోడీ స్పష్టతివ్వాలి

ప్రజాశక్తి -మధురవాడ : విభజన హామీలపై విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐ, సిపిఎం మధురవాడ జోన్ కార్యదర్శులు వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధురవాడలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించాలని, గిరిజన విశ్వవిద్యాలయంపై తాత్సారం మానాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీటి గురించి ప్రశ్నించకుండా మోడీకి భజన చేస్తుందని విమర్శించారు. సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతున్నట్లు బిజెపి నేతలు చెబుతున్నారని, దాన్ని కూడా అంగీకరించబోమని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించుకుంటూపోతే అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఉండవని ఆందోళన వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజ్ ఇస్తామని చెప్పి జిల్లాకు ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారని విమర్శించారు. రాష్ట్ర రాజధాని ఏదో బిజెపి స్పష్టంచేయాలని డిమాండ్‌చేశారు. ప్రధాని సభ పేరుతో ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో చెట్లు నరికి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

కారు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -కశింకోట : గుర్తు తెలియని కారు ఢీకొనడంతో కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన బొర్రా సత్తిబాబు(24) మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలివి. బుధవారం రాత్రి కశింకోట జాతీయ రహదారి సరోజినీ గెస్ట్ హౌస్ వద్ద సత్తిబాబు రోడ్డు దాటుతుండగా ఎలమంచిలి నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే కారు ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయమైంది. క్షతగాత్రుడిని అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృత్యువాత పడ్డాడు. స్థానిక ఎస్ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొద్దిరోజుల వ్యవధిలో ఇద్దరు అన్నదమ్ముల దుర్మరణం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్తిబాబు అన్నయ్య నాగు కూడా గతనెల 23న తాళ్లపాలెం జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అన్నయ్య పెద్దకర్మ నిర్వహించిన తమ్ముడు సత్తిబాబు, అది జరిగి మూడు రోజులు తిరక్కుండానే కారు ఢీకొని మృత్యువాత పడడంతో ఇద్దరు బిడ్డలను కోల్పోయిన వారి తల్లిదండ్రులు బొర్రా అప్పారావు, వరలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది. దీంతో హౌసింగ్ కాలనీలో విషాదం చోటుచేసుకుంది.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-పద్మనాభం : నిరుపేద కుటుంబంలోని యువకుడు దమరశింగు పద్మనాభస్వామి అకాల మృతి చెందడంతో అతని తల్లి రాములమ్మకు పద్మనాభం గ్రామానికి చెందిన యువకులు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్‌టికి చెందిన ఆ కుటుంబంలో అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సామాజిక కార్యకర్త కాళ్ల శ్రీనివాసమూర్తి యువకులతో కలిసి ఆర్థిక సహాయం అందించారు.

అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ ఆందోళన ఫలితంగా భీమిలి మండలం అమనాం గ్రామానికి చెందిన బాధ్యులపై స్థానిక పోలీసులు ఎట్టకేలకు గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు భీమ్‌సేన్ వార్ సభ్యులు దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తన మోటారు బైక్‌ను తగుల బెట్టారని ఆరోపిస్తూ అమనాం గ్రామానికి చెందిన దళిత యువకుడు సారిక సాయిగణేష్ ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాధ్యులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : కలిగొట్ల స్విగ్గ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చినబజారు కుట్టు శిక్షణ కేంద్రంలో 8వ బ్యాచ్‌ను ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి గురువారం ప్రారంభించారు. తమ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో 500 మందికి పైగా ఉపాధి పొందినట్లు వివరించారు. ఆసక్తి గల మహిళలు 9643222666 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జి.రాము, వి.లక్ష్మణరావు, నరసింగరావు, అశోక్ పాల్గొన్నారు.

కణితి హైస్కూల్లో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధిలోని కణితి జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లా స్థాయి త్రో-బాల్, వాలీ-బాల్, బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాలలో ఎంపికైన వివిధ పాఠశాల క్రీడాకారులకు అండర్ -14, అండర్ -17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడల పట్ల కూడా విద్యార్థులు ఆసక్తి కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోమటి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, పిఇటి మన్నాజీ, నాయకులు వేణుబాబు, చిత్రాడ రమణ, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు పాల్గొన్నారు.

వరి పంటను శాస్త్రవేత్తల పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి గ్రామంలోని వరి పంట పొలాలను డాట్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భవాని, డిఆర్‌సి ఎడిఎ చదువుల సుబ్రహ్మణ్యం, భీమిలి మండల వ్యవసాయ శాఖాధికారి బి.శివకోమలి గురువారం సందర్శించారు. సోనా మసూరి, సాంబ మసూరి రకాల్లో కొన్ని చోట్ల దోమ పోటు కనబడిందని వారు తెలిపారు. దీని వల్ల వరి పంట కాండం మొదళ్ల లేత పసుపు రంగు నుంచి ఎరుపు రంగులోకి మారడం, తర్వాత పంట మొత్తం గడ్డి రంగులోకి మారుతుందని వివరించారు. ఈ లక్షణాలు కనబడిన వెంటనే పొలంలో ఉన్న నీటిని పూర్తిగా తీసేసి ఎండ గట్టాలని రైతులకు సూచించారు. పొలాన్ని పాయలుగా విడదీసి, మొక్క మొద ళ్ల తడిచేలా మందు కొట్టాలని వివరించారు. కోతకు ఇంకా 20 రోజులు సమయం ఉంటే పయో మెట్రిజిన్ 6 గ్రాములు ద్రావణం లీటరు నీటికి చొప్పున 120 గ్రాములు ఎకరా కు పిచికారీ చేయాలని చెప్పారు. డినోట్ ఫ్యూరాన్ 4 గ్రాముల ద్రావణం లీటరు నీటికి చొప్పున 80 గ్రాములు ఎకరా కు పిచికారీ చేయాలన్నారు. ట్రిఫ్లు మైజో ఫైరిన్ 48 గ్రాములు లీటరు నీటికి చొప్పున 96 గ్రాములు ద్రావణం పిచికారీ చేయాలని తెలిపారు. సోనా మసూరి పొలాల్లో పొట్ట దశలో ఆకు ముడత తెగులు ఆశించినట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. దీని నివారణకు కార్టో ఫైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరాకు 8 కిలోలు 20 కిలోల ఇసుకతో కలిపి చల్లటం వల్ల ఆకుముడతతో పాటు కొంత మేర కాండం తొలిచే పురుగును కూడా తగ్గించ వచ్చని తెలిపారు. దాకమర్రి విహెచ్ఎ భాగ్యరేఖ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

ప్రజాశక్తి-తగరపువలస : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యాన గోస్తనీ ఒడ్డున శ్మశాన వాటిక వద్ద ఇసుక అక్రమ తవ్వకాలపై గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. 25 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.రామకృష్ణ, ఎస్ఐ డి.పద్మావతి, విఆర్ఒలు మోహన సాయి, రంభ, సిబ్బంది కృష్ణారావు, రమేష్, విఆర్ఎ పాల్గొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో వర్క్ షాప్



అనిల్ నీరుకొండ ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో గురువారం లైవ్ ఆపరేటివ్ వర్క్ షాప్ నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్ నుంచి శస్త్ర చికిత్సను నేరుగా ఆడిటోరియంలో ప్రదర్శించారు. లైవ్ శస్త్ర చికిత్స పట్ల అవగాహన కలిగినట్లు హాజరైన విద్యార్థులు అభిప్రాయ పడ్డారు. ఆసుపత్రి సిఇఒ కె నిరంజన్, సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణమూర్తి, ఎన్‌ఆర్ఐఐఎంఎస్ ప్రిన్సిపల్ రాధామాధవ్ త్రిపాఠి, జనరల్ సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ మహంతి, జనరల్ మేనేజర్ గణేష్ సహకారంతో వైద్యులు రంజిత్ మనోహర్, సత్యకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శస్త్ర చికిత్స విభాగాన్ని ప్రారంభించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో డెంగీ, మలేరియా వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జోనల్ కమిషనర్ బి.రాము ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంట్లో తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. వారానికోసారి డ్రైడేను పాటించాలని, ఇళ్లలో నీటి ట్యాంకులను శుభ్రపరిచి, ఎక్కువ రోజులు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, ఎసిపి శాస్త్రి, ఎఇ అప్పాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు వెంకటరెడ్డి, బాబూరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు సరిపడక అవస్థలు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయానికి వచ్చే భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేక భక్తులు గురువారం తీవ్ర అవస్థలు పడ్డారు. మె ఐ హెల్ప్ యు కార్యాలయం పక్కనే ఉన్న మరుగుదొడ్ల వద్ద మహిళలు క్యూలైన్లో వేచి ఉండడం కనిపించింది. సింహాచల దేవస్థానం అధికారులు గతంలో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసినా ప్రస్తుతం వాటిలో కొన్నింటికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో చేసేదిలేక మహిళలు ఒకే మరుగుదొడ్డి వద్ద క్యూ లైన్‌లో నిలబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై పలువురు మహిళలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారులు దృష్టి సారించి తగినన్ని మరుగు దొడ్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

గీతంతో అనుబంధానికి అమెరికన్ కంపెనీ ఆసక్తి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో అనుబంధానికి అమెరికాకు చెందిన ప్రముఖ ఇంజినీరింగ్ డిజైన్, ఐటి కంపెనీ ఎవీనియన్ ఆసక్తి కనబరిచింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధి బృందం గురువారం గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఎవీనియన్ ఇండియా అధ్యక్షుడు రఘు గణేశన్, మానవ వనరుల విభాగం ఉపాధ్యక్షుడు కె.ప్రసన్న, సీనియర్ ఉపాధ్యక్షుడు గిరి వెంకటరామన్, మానవ వనరుల విభాగం డైరెక్టర్ అవీన్ మళ్ళ గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్లతో, ట్రైనింగ్ ప్లేస్మెంట్ విభాగం అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. గీతం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అసోసియేట్ డీన్ డాక్టర్ జివికె.శర్మ వివిధ కోర్సుల వివరాలు, పరిశోధనా ప్రాజెక్టులు, ప్రయోగశాలల ఆధునికీకరణ తదితర అంశాలను వివరించారు. గీతం సందర్శనలో భాగంగా ఎవీనియన్ ప్రతినిధులు వివిధ విభాగాలను సందర్శించారు. జియోస్పేషియల్ రంగంలో జరుగుతున్న ప్రగతిని, భవిష్య అవకాశాలను విద్యార్థులకు వివరించారు.

13న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - ఆరిలోవ : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 1991-96లో ఇంటర్, డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఈ నెల 13న ముడసర్లోవ పార్కులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం 9.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.73 కోట్లు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను 44 రోజులకు గాను గురువారం దేవస్థానం ఇన్‌ఛార్జి ఒ.త్రినాధరావు సమక్షంలో లెక్కించారు. నగదు రూ1,73,13,159, బంగారం 171 గ్రాములు, 400 మిల్లీ గ్రాములు, వెండి 13 కిలోల 790 గ్రాములు లభించినట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానానికి చెందిన వివిధ విభాగాల ఎఇలు ఆనంద కుమార్, జంగం శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులు, ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప పూజా మహోత్సవాలు

ప్రజాశక్తి -తగరపువలస : శ్రీ మణికంఠ స్వీట్స్ అండ్ బేకరి యాజమాన్య ప్రతినిధులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక శివాలయం ఎదురుగా విశాల ప్రాంగణంలో పడిపూజ, అయ్యప్ప స్వామి సన్నిధాన పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానికంగా గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆదిమూలం నాగరాజు, గ్రంధి సురేష్, నాగబాబు మాట్లాడుతూ, శబరిమలలో ఉన్న నమూనాలో 18 మెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గురుస్వామి ఆకెళ్ల నర్సింహమూర్తి, సింహాచలానికి చెందిన శ్యామలానంద నాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. పంచామృతాలతో కూడిన అభిషేకాలు జరుగుతాయన్నారు. ప్రయాగ చక్రవర్తి ఆధ్వర్యాన కచేరీ ఉంటుందని చెప్పారు.

'ఉక్కు' ఉద్యమం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-ఉక్కునగరం : దేశవ్యాప్త ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి విశాఖ ఉక్కు ఉద్యమం స్ఫూర్తిదాయకమని స్టీల్ ఆఫీసర్స్ ఫెడరేషన్ పూర్వపు నాయకులు డాక్టర్ డిఎన్ శర్మ (రాంచీ), ఎఐటియుసి ఫెడరేషన్ నాయకులు రామ్ అగార్ సింగ్ (బొకారో) పేర్కొన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 637వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పి, ఎసిఎస్, హెచ్‌ఆర్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ బిఎఫ్ - 3ను, మిగిలి ఉన్న విభాగాలను తక్షణమే పున్రప్రారంభించాలని, 7.3 మిలియన్ టన్నులకు అనుగుణంగా ఉత్పత్తిని తీయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. రామ్ అగార్ సింగ్ మాట్లాడుతూ, భారతదేశంలోని ఏ స్టీల్ పరిశ్రమలోనూ ఇంతటి సుదీర్ఘ పోరాటం జరిగిన చరిత్ర లేదన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కే ఆ ఘనత దక్కుతుందన్నారు. స్టీల్ ఉద్యోగులకు ఇపిఎస్ 95 పింఛను పూర్తి జీతంపై ఇవ్వాలని సుదీర్ఘంగా న్యాయ పోరాటం సుప్రీంకోర్టులో సాగిస్తున్నామని తెలిపారు. దానిపై తీర్పు వచ్చినప్పటికీ అమలుపై ఇపిఎఫ్ఒ స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. దీన్ని అమలయ్యేలా చూడాలని యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, గుమ్మడి నరేంద్ర, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, జి.జయ, బిఎస్.రాజు, ఎంవి.రమణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న డిఎన్ శర్మ, రామ్‌అగార్ సింగ్

'16న విద్రోహ దినం'

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 16 తేదీన చేపట్టే విద్రోహదినాన్ని జయప్రదంచేయాలని ఇపిఎఫ్ 95 పెన్షనర్స్ జిల్లా ఉపాధ్యక్షులు యువిఎస్ఎన్.వర్మ, కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ పిలుపునిచ్చారు. మల్కాపురం సిఐటియు కార్యాలయంలో గురువారం ఇపిఎఫ్ 95 పెన్షనర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు నవంబర్ 4న ఇచ్చిన కోర్టు తీర్పు కొంత అనుకూలంగా వచ్చిందన్నారు. మరి కొంత సాధించుకోవాల్సి ఉందని తెలిపారు. దీనిపై లోతుగా పరిశీలించి, పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగించాల్సి ఉందన్నారు. దానిలో భాగంగా ఈ నెల 16వ తేదీన విద్రోహదినం చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7, 8 తేదీలలో ఢిల్లీలో సదస్సు, ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ వెళ్లే సభ్యుల నిమిత్తం కొంతమంది రూ.3200 విరాళం అందించారు. వారికి జిల్లా కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. కె.నూకరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిహెచ్.తమ్మారావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

వైవి సుబ్బారెడ్డిని కలిసిన బొడ్డేటి

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని ఆ పార్టీ సీనియర్ నాయకులు, రామకృష్ణనగర్ శివాలయం టెంపుల్ గుడి చైర్మన్ బొడ్డేటి కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని వైవి సుబ్బారెడ్డి సూచించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో ఉత్తరాంధ్రకు నష్టం

ప్రజాశక్తి-మాధవధార : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణతో ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు తీవ్ర హాని కలుగుతుందని కాంగ్రెస్ ఎపి ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండగా నిలవాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ విచ్చేయుచున్న తరుణంలో ఈ అంశంపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేయడం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా అత్యవసరమన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు, మెట్రో రైల్ కారిడార్, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, ఉత్తరాంధ్ర పెట్రో యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీ పనులు తదితరాలు పూర్తయ్యేలా డిమాండ్‌చేయాలని కోరారు.

పనిచేసే వారికి ప్రాధాన్యత

ప్రజాశక్తి- ములగాడ : పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ తెలిపారు. ఇటీవల సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా నియమితులైన తంతటి సంపత్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, సురేష్ యాదవ్‌కు తంతటి సంపత్ ధన్యవాదాలు తెలిపారు.

నేటి నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ : ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా శుక్రవారం చేపట్టే నిరసన కార్యక్రమాలను జయప్రదంచేయాలని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బొగవిల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల వరకు హెచ్‌పిసిఎల్ మెయిన్ గేట్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు.

ప్రధాని సభ విజయవంతానికి సమావేశాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : విశాఖలో ఈ నెల 12న జరిగే ప్రధానమంత్రి సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పి.బాలరాజు స్థానిక నాయకులను కోరారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ఎంపిటిసిలు, సర్పంచులు, వాలంటీర్లతో గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

కరాస: ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు 52వ వార్డులో వైసిపి ప్రధాన కార్యకర్తలు, నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలతో ఆయన ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. శాంతినగర్, కరాస, న్యూ కరాస, గౌరీనగర్, గణేష్ నగర్, ఉడా లే అవుట్ ప్రాంతాలలో ఈ సమావేశాలు నిర్వహించారు. పార్టీలకతీతంగా అందరూ హాజరై వారికి స్వాగతం పలకాలని, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ సుధాకర్, వార్డు ఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వికలాంగుల బస్సు పాస్ మేళా

ప్రజాశక్తి- ములగాడ : వికలాంగులకు గురువారం నిర్వహించిన బస్సు పాస్ మేళా ప్రశాంతంగా సాగింది. శిబిరానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి 100 మంది హాజరయ్యారు. గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ సహకారముతో బస్సు పాసులు అందించారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని కీలక విభాగాలలో కార్మికుల సంఖ్య పెంచాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లోని సిఎంఎస్ వద్ద ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విభాగం అధ్యక్షులుగా కె.శ్రీరామచంద్రరావు, కార్యదర్శిగా బి.నాగేశ్వరరావు, 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఇద్దరు మహిళలు వై.ఝాన్సీ, పి.హేమకు ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటంలో ఈ విభాగం నుంచి 50 సార్లు దీక్షా శిబిరంలో కూర్చున్నారని తెలిపారు. ప్లాంట్‌లో ఉత్పత్తులు పెరగడానికి ఆటోమేషన్ ద్వారా ఈ విభాగంపై అత్యంత ప్రభావం చూపుతోందన్నారు. ఈ విభాగంలో కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ వారిపై పని భారాన్ని మోపుతున్నారని, దీనిపై యాజమాన్యం పునరాలోచించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వైటి.దాస్ మాట్లాడుతూ, ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేకంగా ఇప్పటికే అనేక కార్యక్రమాలను విజయవంతంగా చేశామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా శుక్రవారం దీక్షా శిబిరానికి వేలాదిమంది హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు యూనియన్ కార్యవర్గం నుంచి యు.రామస్వామి, కె.గంగాధర్, విభాగం ప్రతినిధులుగా ఎ.సురేష్, గణేష్‌కుమార్, సీతారామయ్య, కొండలరావు, సత్యనారాయణ, రామకృష్ణ, దివాకర్ నాయుడు హాజరయ్యారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సమస్యలపై సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు హెచ్‌ఆర్ సిజిఎంతో గురువారం సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ కార్యాలయాన్ని ఆధునికీకరించి సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలని, ఏకలవ్య పార్కును అభివృద్ధి చేసి అక్కడ ఏకలవ్యుని విగ్రహాన్ని పెట్టాలని, బిర్సా ముండా, కొమరం భీమ్ పార్కులను నిర్మించి, వారి విగ్రహాలు ఏర్పాటుచేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. నాన్ ఎగ్జిక్యూటివ్‌లలో అర్హులైన ఉద్యోగులకు జెఒలుగా ప్రమోషన్, గతంలో ఏఈ ప్రమోషన్లలో అన్యాయం జరిగిన వారికి భవిష్యత్తులో ఇచ్చే ప్రమోషన్లలో న్యాయం చేయాలని, మెడికల్ విభాగంలో కోవిడ్ వల్ల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని అధికారు హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. ఈ సమావేశంలో హెచ్‌ఆర్ సిజిఎం కల్లూరి శ్రీనివాసరావు, జిఎం కంచర్ల సంజీవరావు, డిజిఎం తిరుపతిరావు, అధికారి ప్రసాద్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు భయ్యా మల్లయ్య, తౌడన్న, ఎస్.సత్యనారాయణ, దాసరి పుల్లారావు, మోహన్‌బాబు, ఎల్‌వి.రమణరావు, వేణుగోపాలరావు, గణేష్, కిషోర్ సింగ్, పైడి కొండలరావు, బిడి.నాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పెందుర్తి శాఖా గ్రంథాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యకళ తదితరులు

ప్రజాశక్తి-పెందుర్తి, గాజువాక : గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీ నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందరూ హాజరై వారోత్సవాలను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆడారి రామకృష్ణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సెక్రటరీ దాసరి సత్యం, డి.దేవుడు, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ సీనియర్ ఏజెన్సీ మేనేజర్ పి జగన్నాధరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

-గాజువాక : గాజువాక గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను గ్రంథాలయాధికారి బి.చంద్రకళ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు.

14న అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) నందు వివిధ కోర్సులు పూర్తిచేసి అప్రెంటిస్ పూర్తి చెయ్యని వారికోసం ప్రభుత్వ ఐటిఐ నరవ ఆధ్వర్యాన కంచరపాలెంలోని ఓల్డ్ ఐటిఐ ప్రాంగణంలో ఈ నెల 14న అప్రెంటిస్ మేళా -2022 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటిఐ నరవ ప్రిన్సిపల్ బి.విజయలక్ష్మి తెలిపారు. ఏ ట్రేడ్‌లోనైనా ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ మేళాలో పాల్గొనాలని కోరారు. హిందుస్థాన్ షిప్‌యార్డుతో పాటు ప్రముఖ 10 కంపెనీల ప్రతినిధులు అప్రెంటిస్ మేళాలో పాల్గొని ఆయా సంస్థలలో అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 14 ఉదయం 10 గంటలకు ఓల్డ్ ఐటిఐ క్యాంపస్‌కు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9398785720 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

56వ వార్డులో అన్నదానం

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 56వ వార్డు పరిధి కంచరపాలెం మెట్టు నుంచి సిద్ధార్థ నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన గురువారం గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు హాజరై ముందుగా గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్న సంతర్పణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 31 ఏళ్లగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు జరపడంలో సంఘ సభ్యుల కృషి గొప్పదని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు కొణతాల సూర్యనారాయణ మాట్లాడుతూ, సుమారు 3 వేల మందికి అన్నసంతర్పణచేశామన్నారు. ఈ కార్యక్రమంలో 56, 57 వార్డుల కార్పొరేటర్లు రాజశేఖర్, ముర్రువాణి నానాజీ, 54, 57 వార్డుల టిడిపి అధ్యక్షులు కార్తీక్ కుట్ట, పెంటకోట అజయ్‌బాబు, కోరుబిల్లి సురేష్, పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : నూతన విద్యా విధానంలో సామాజిక సర్వేకు, చైతన్యానికి, సామాజిక సమస్యల అవగాహనకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దానిని విద్యార్థులు సక్రమంగా వినియోగించుకుని నూతన విద్యా విధానాన్ని విజయవంతం చేయాలని జాతీయ సేవా పథకం సీనియర్ అధికారి వై.అనసూయా దేవి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతన విద్యావిధానంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు.

హక్కుల సాధనకు ఉద్యమం



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రజాశక్తి- అనకాపల్లి : హక్కుల సాధనకు మహిళలు ఉద్యమించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి ప్రభావతి అన్నారు. బుధ గురువారాల్లో స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ అరుణ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మహిళా సభ్యుల తరగతులలో మాట్లాడుతూ, స్వాతంత్ర పోరాటం నుంచి మహిళలు అనేక ఉద్యమాల్లో విరివిగా పాల్గొన్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. విద్యాహక్కు, ఓటు హక్కు పోరాటాల ద్వారానే మహిళలకు సిద్ధించాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రభుత్వాలు కోతలు పెడుతున్నాయన్నారు. మహిళలకు కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్టులు అన్యాయం



అచ్యుతాపురంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకే వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం అచ్యుతాపురం జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ రాము మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, ఉత్తరాంధ్ర అభివృద్ధి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిధులు వంటి రాష్ట్ర విభజన హామీలను ప్రధాని మోడీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాల కల్పన హామీ అమలులో మోడీ సర్కారు పూర్తిగా విఫలమైందని, కొత్త పరిశ్రమలు, ఉద్యోగాలు లేకపోగా,న ఉన్నవాటిని లేకుండా చేస్తున్నారని, లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగసంస్థలు, విశాఖ ఉక్కులాంటి పరిశ్రమలకు ప్రైవేటుకు అమ్మేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి అన్ని విధాలుగా అన్యాయం చేస్తున్న మోడీని ప్రశ్నించాల్సిందిపోయి, రాష్ట్రంలోని అధికారవైసిపి, విపక్షాలు స్వాగతించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండ్రపు సోమునాయుడు ,రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇసుక దందాకు అడ్డుకట్ట

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



ఎస్ఇబి సిఐ జనార్ధనరావు

ప్రజాశక్తి -యలమంచిలి : యలమంచిలిలో ఇసుక దందాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సిఐ. జె.జనార్ధన రావు అన్నారు. బుధవారం ప్రజాశక్తిలో 'అడ్డదారుల్లో ఇసుక దందా' శీర్షికతో ప్రచురితమైన కథనంపై సిఐ స్పందిస్తూ, ఇసుక ర్యాంపుల నుంచి తీసుకొచ్చే ఇసుక పర్మిట్ నిర్మాణదారుని పేరునే ఉండాలని, అలా లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఒకరి తరపున వేరొకరు తేస్తే, అక్రమ వ్యాపారం చేస్తున్నట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఉదంతంపై చర్యల గురించి ప్రశ్నించగా స్నేహితుడి అవసరం నిమిత్తం ఇసుకను బల్క్‌గా లారీలో రప్పించి, వాహనం వెళ్లే మార్గం లేక ఎడి కార్యాలయం ముందు ట్రాక్టర్లతో సరఫరా చేసినట్లు లక్ష్మణ్ అనే వ్యక్తి అంగీకరించినట్లు సిఐ. జనార్ధనరావు తెలిపారు. ఇసుకతోపాటు గుట్కా, ఖైనీ, గంజాయి, సారాయి వంటి అక్రమ రవాణా, నిల్వ సమాచారముంటే తెలియజేసి సహకరించాలని కోరారు.

నేడు 'మోడీ గోబ్యాక్' నిరసనలో పాల్గొనండి



సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో 11న వామపక్షాల ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టే 'మోడీ గో బ్యాక్' నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ నాయకులు వైఎన్ భద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయకపోవడమే కాకుండా ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును ప్రయివేటుకు కట్టబెట్టాలని చూస్తున్న బిజెపికి నేతలకు, ప్రధాని మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. అటువంటి ప్రధాని మోడీకి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వాగతం పలకడం, చంద్రబాబు నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం కుంటుపడిందని, ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరించి నిరుద్యోగాన్ని మరింత పెంచుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఎం నాయకులు ఎ బాలకృష్ణ, ఆర్ శంకర్‌రావు, ఉమామహేశ్వరరావు, రాజు, సిపిఐ ఎంఎల్ నాయకులు అజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ నాయకులు హరినాథ్‌బాబు, సిఐటియు నాయకులు శంకర్రావు, ఎఐటియుసి నాయకులు కోన లక్ష్మణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు, కార్యవర్గ సభ్యులు కొడుకుల సన్యాసిరావు పాల్గొన్నారు.

ఏం వెలగబెట్టారని స్వాగత సన్నాహాలు?



ధర్నా చేస్తున్న సిపిఐ, అనుబంధ సంఘాల నేతలు

మోడీ పర్యటనను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి- కె. కోటపాడు : విభజన హామీలను అమలు చేయక, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీని స్వాగతించేందుకు ప్రభుత్వ పెద్దలు తెగ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రానికి ఏం వెలగబెట్టారని ఈ స్వాగత సన్నాహాలంటూ మండల సిపిఐ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం ప్రధాని మోడీ విశాఖ పర్యటనను నిరసిస్తూ స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో నిరసన చేపట్టారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేముడుబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తున్నారని, రైల్వే జోన్‌పై స్పష్టత లేదని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి , పోలవరానికి నిధులు ఇవ్వలేదని, ప్రత్యేకహోదాతోపాటు విభజన హామీల అమలులో నమ్మించి మోసం చేశారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రధాని మోడీని అధికార, విపక్షాలు నిలదీసి, ఎండగట్టాల్సిందిపోయి, ఎర్రతివాచీ పరిచి స్వాగతించడం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమేనన్నారు. కార్యక్రమంలో రెడ్డి అప్పలనాయుడు, దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి ఇల్లాకు రాము, సీముసిరి సూర్యనారాయణ, దమ్ము ముత్యాల నాయుడు, చప్ప కోటి, సీముసిరి రామనాయుడు, కొమ్మి ఈశ్వరరావు, గాడి ప్రసాద్ పాల్గొన్నారు.

75 మంది ఎన్‌సిసి విద్యార్థుల ఎంపిక



అభ్యర్థులను ఎంపిక చేస్తున్న ఎన్‌సిసి అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో ఎన్‌సిసి విభాగానికి విద్యార్థుల ఎంపిక గురువారం నిర్వహించారు. 300 మంది విద్యార్థులు పాల్గొనగా, అభ్యర్థుల ఎత్తు, ఫిట్నెస్, రన్నింగ్, సిటప్స్, పుషప్స్ ఆధారంగా 75 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జయబాబు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో 13వ ఆంధ్ర బెటాలియన్ పి ఐ స్టాఫ్ పుష్కర్ సింగ్, మదన్ బండారి, ఎన్సిసి అధికారులు జగదీశ్వరరావు, లెఫ్టినెంట్ ఎఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఎన్ఎఒబి వద్ద కొనసాగుతున్న ఆందోళన



ఆందోళనలో మాట్లాడుతున్న దేవుడునాయుడు

ప్రజాశక్తి - రాంబిల్లి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి మెయిన్ గేటు వద్ద నేవీ నిర్వాసితులు చేపడుతున్న నిరసన ఆందోళన గురువారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఎనిమిది నిర్వాసిత గ్రామాలకు చెంది వేలాదిమంది బైఠాయించి ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడునాయుడు మాట్లాడుతూ, నేవీ నిర్వాసితుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మూసేసిన నాలుగు గేట్లను తెరవాలని, పెండింగ్ ప్యాకేజీలు చెల్లించాలని, నిర్మాణ పనులలో స్థానికులకు 75శాతం ఉపాధి కల్పించాలని, నిర్వాసిత రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, కొప్పు గుండుపాలెం నుండి రాజ్యాల అగ్రహారం వరకు రోడ్డు నిర్మించాలని పిడిఎఫ్ నిర్వాసితులైన వారికి పూర్తిస్థాయిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేవీ కాలనీలో మౌలిక సదుపాయాలు వెంటనే మెరుగుపరచాలని, చిన్న కలవల పల్లి, కొత్తపేట గోవిందపాలెంచ వాడ్రాంబిల్లి గ్రామాలను పిఐఎఫ్ గ్రామాలుగా గుర్తించి, ప్యాకేజీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేవీ మెయిన్ గేట్ నుండి వెంకటాపురం సెంటర్ వరకు కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులతో చర్చలకు కలెక్టర్, జిల్లా అధికారులు ఆహ్వానించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9

గిరిజన హక్కుల కాలరాత

జగన్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్సీ బుద్ద ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : గిరిజనుల హక్కులను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కాలరాస్తోందని తెలుగుదేశం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం స్థానిక రింగ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో కలపాలని, అక్కడ శతశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గిరిజనులకే వర్తించేలా ఉన్న జిఒ 3ను పునరుద్ధరించాలని కోరారు. టిడిపి హయాంలో చంద్రబాబు ఈ జిఒను తీసుకొచ్చి గిరిజనాన్ని ఆదుకుంటే, సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసినా రివ్యూ పిటిషన్ వేయడానికి సిఎం జగన్ ప్రభుత్వం ముందుకు రాకపోవడం గిరిజనులకు అన్యాయం చేయడమేనన్నారు. జగన్మోహన్ రెడ్డి అసమర్ధ పాలనకు ఇది నిదర్శనమన్నారు. ఉందన్నారు. జిల్లాలో నాన్ షెడ్యూల్ గిరిజన ప్రజలను షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించి వారికి అన్నిప్రభుత్వ రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు దున్ను దొర, పార్లమెంటు అధ్యక్షులు బర్రి చిన్నబ్బాయి దున్ను దొర పాల్గొన్నారు.

పెండింగు ఈ-చలానాలు రద్దు చేయాలి



రామచంద్ర థియేటర్ జంక్షన్లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రవ్యాప్తంగా ఆటో మోటార్ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న పోలీస్ ఈ -చలానాలను రద్దు చేయాలని కోరుతూ గురువారం రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో కనకదుర్గ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఎఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం, ఆటో సంఘం జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ, కోరిబిల్లి జగదీష్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, పింఛన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటోలపై జరిమానాలు పెంచుతూ తెచ్చిన జిఒ 21 రద్దు చేయాలని, ఫైనాన్సర్ల అక్రమాలు అరికట్టాలన్నారు. ఆటో కార్మికులకు వడ్డీ లేకుండా బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మత్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పక్కి రమేష్, ఆటో సంఘం నాయకులు కె నాగరాజు, నాయుడు శ్రీనివాసరావు, పైడిరాజు, జగదీష్, శివ, వెంకటరమణ, శ్రీను, పరమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

21న శూలాల మహోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : కార్తీక మాస నేపథ్యంలో స్థానిక చినరాజుపేట చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 21న శూలాల మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సిద్ధార్థ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎంపీ డాక్టర్ బీవీ.సత్యవతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంబశివ దేవాలయ కమిటీ సభ్యులు బాసిన బాల గురూజీ, మాపూరి సూరేష్, సంతోష్, సతీష్, శివ, మాపూరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రొబ్బి మల్లేశ్వరరావు, విన్నకోట నీలేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం జరిగింది. గౌరవఅధ్యక్షుడిగా లెక్కల లింగన్న, అధ్యక్షులు జె.అప్పారావు, ఉపాధ్యక్షులుగా జి.సంతోషి నళిని, కార్యదర్శిగా పి. అప్పలనాయుడు, ట్రెజరర్‌గా కె.సుధాకర్, సలహాదారుగా టి.పవన్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం వివరాలను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.వి.రమణకు అందజేశారు.

చురుగ్గా డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి -వడ్డాది : వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో డ్రైనేజ్ పనులు ఎట్టకేలకు ప్రారంభమై, చురుగ్గా కొనసాగుతున్నాయి రోడ్డు విస్తరణలో భాగంగా ఐదు నెలల క్రితమే ఆక్రమణలను తొలగించినప్పటికీ, వర్షాల సీజన్ కావడంతో ఇన్నాళ్లు పనులు మొదలు పెట్టలేదు. ఎట్టకేలకు వర్షాలు పూర్తిగా తెరిపినివ్వడంతో పనులు ప్రారంభించారు. రూ. 70 లక్షలతో పాలకేంద్రం నుండి పెద్దేరు నది వరకు కాలువ నిర్మిస్తున్నారు. కొంతమేర రోడ్డు విస్తరణ చేయనున్నారు.

తహశీల్దార్‌గా గంగాధరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి తహశీల్దార్‌గా పీవీఎల్ఎన్ గంగాధరరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపీ సత్యవతికి సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ ఇఒ చంద్రశేఖర్ గురువారం ఎంపీ డాక్టర్ బివి సత్యవతిని మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించారు.

చౌడపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : చౌడపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారిణి బి అలేఖ్య పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైసిపి నేత గండిబోయిన వెంకట్, సిహెచ్ఒ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆర్‌టిఐ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్‌టిఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని యుఎఫ్ఆర్‌టిఐ జాతీయ అధ్యక్షుడు బి రామకృష్ణ రాజు అన్నారు. గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఆర్‌టిఐ కార్యాచరణపై ప్రణాళిక రూపొందిస్తా మన్నారు. సమాచారం కోరుతూ అందించే దరఖాస్తులపై స్పందించని అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై పూర్తి ఆధారాలతో నివేదిక రూపొందించామన్నారు. సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్ చక్రధర్, ఆర్ బుజ్జి బాబు, బివి వి సత్యనారాయణ, కొల్లిచిన అప్పారావు, దండు గణపతి రాజు పాల్గొన్నారు.

210 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి -అనకాపల్లి : గాంధీనగరం సాయిశక్తి పాఠశాలలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, రాజా ఆర్టికల్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అన్నం రాజశేఖర్ సహకారంతో ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. సాయిశక్తి విద్యాసంస్థల చైర్మన్ అన్నం ఆంజనేయులు శిబిరాన్ని ప్రారంభించారు. 210 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తాటికొండ జీవన్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 40 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కాగా, విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి 50శాతం రాయితీతో ఇవ్వనున్నట్లు రాజా ఆప్టికల్స్ అధినేత పూసర్ల రాజా తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్ట్ డాక్టర్ పి దేవి ప్రభాకర్, బత్తుల సతీష్, గోపాలకృష్ణ, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు ముంగిటికే సేవలను అందిస్తున్నారని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. గురువారం మండలంలోని పిసినికాడ పంచాయితీ బసవరామ తారక కాలనీలో పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ మంజూరు చేసిన రూ. 22 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లపు వెంకట రమేష్, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాలరావు, ఎంపిటీసీ ఎంపిటీసీ సభ్యురాలు మొల్లేటి హైమా శివాజీ, బుద్ద నాగేశ్వరరావు, బిశెట్టి తాతారావు, దాడి రామకోటి పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభకు మూడు లక్షల మంది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

పకడ్బందీగా జనసమీకరణ : మంత్రి అమర్

ప్రజాశక్తి - యలమంచిలి : శనివారం విశాఖలో జరిగే ప్రధాని మోడీ సభను విజయవంతం చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఇమేజ్ పెంచేందుకు వైసిపి శ్రేణులు కృతనిశ్చయంతో పనిచేయాలని మంత్రి అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. గురువారం యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు క్యాంపు కార్యాలయంలో మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాల పార్టీ ముఖ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రధాని సభకు మూడు లక్షల మందిని తరలించడం లక్ష్యమని, అందులో భాగంగానే యలమంచిలి నియోజకవర్గంలో 104బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తి రాజు మాట్లాడుతూ సభకు వచ్చేవారికి బస్సులు, ఆహారం అన్నీ సుకుమార్‌వర్మ చూసుకుంటారన్నారు. ఎంపిపి బోదెపు గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బొద్దపు ఎర్రయ్యదొర పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఈనెల 12న ప్రధాని మోడీ సభకు భారీగాతరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపిపి రెడ్డి జగన్మోహన్ కోరారు. గురువారం ఎంపిపి కార్యాలయంలో వైసిపి నేతలతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కె.కోటపాడు నుంచి జనసమీకరణకు 60 బస్సులు ఏర్పాటు చేశామని, సభకు వచ్చేవారికి భోజన సదుపాయం కల్పిస్తామన్నారు.మండలం నుంచి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ఇతర నేతలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

కాలుష్యంపై ఎమ్మెల్యేకు నివేదిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ మూల స్వయంబువరం గ్రామంలో కాలుష్యంపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ శాఖల అధికారులు గురువారం ఎంపిడిఒ హేమ సుందరరావు ద్వారా ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు నివేదికలను అందజేశారు. గతంలో ఎన్‌టిపిసి, కూలింగ్ టవర్స్ నుంచి వ్యర్థపు నీటి తుంపర్లు, విషవాయువుల వల్ల ఆయా గ్రామాల్లో కలిగే ఇబ్బందులు, నష్టాలపై నివేదిక అందజేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ మేరకు పరిశీలన జరిపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కాలుష్యం కారణంగా గ్రామంలోని 168 ఇళ్లకు పాక్షిక, పూర్తి నష్టం జరిగిందని, కేన్సర్, కండరాల బలహీనత, ఎముకల సమస్యలు చర్మ కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నట్లు అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ ద్వారా ఈనెల 12న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, సిఎం జగన్‌ల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పిఎస్.రాజు, రాష్ట్ర సిఐసి సభ్యులు పైల శ్రీనివాసరావు వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజుపాల్గొన్నారు

జగనన్న కాలనీలో సౌకర్యాల కల్పనపై దృష్టి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట: సీతయ్యపేటలోని జగనన్న కాలనీలో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ అంబేద్కర్, హౌసింగ్ ఎఇ గోపీనాథ్ అన్నారు. గురువారం జగనన్న కాలనీ లేఅవుట్లను పరిశీలించారు. ఈస ందర్భంగా మాట్లాడుతూ, సీతయ్యపేట జగనన్న కాలనీలో 60 ఇళ్ల స్థలాలు మంజూరు చేసినప్పటికీ, సరైన సౌకర్యాలు లేకపోవడం లబ్దిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు. కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పనకు గల అవకాశాలను పరిశీలించారు. ప్రత్యామ్నాయంగా వేరే స్థలం ఇస్తే రోడ్డుకు అవసరమైన స్థలాన్ని అందిస్తానని గ్రామానికి చెందిన పలక గంగాధర్ ముందుకు వచ్చాడు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడతామని తహశీల్దార్ అన్నారు. డంపింగ్ యార్డ్‌కు రోడ్ ఏర్పాటుకు స్థల సర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. వజ్రపు శ్రీను, కర్ణం నగేష్, దకవరపు నాగరాజు, చెల్లారావు, రాజుబాబు, ముసిలి నాయుడు, విఆర్ఒ రమణ, బొడ్డుశ్రీను వైస్ ప్రెసిడెంట్ లక్ష్మిరావు పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో సౌకర్యాల కల్పనపై దృష్టి

12,13 తేదీల్లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు



పోటీల వాల్‌పోస్టరు ఆవిష్కరిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

ప్రజాశక్తి- చోడవరం : రాష్ట్ర, జిల్లా యోగా అసోసియేషన్లు, పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 12 13 తేదీల్లో ఉషోదయ విద్యాసంస్థల్లో రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ యోగా అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ పుల్లేటి సతీష్ తెలిపారు. గురువారం చోడవరంలో దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 8-80ఏళ్ల వయస్సుగల సుమారు 500 మంది స్త్రీ,పురుషులు ఈ పోటీల్లో పాల్గొంటారని, విజేతలైన వారు వచ్చేనెల 26, 27 ,28 తేదీల్లో పాండిచ్చేరిలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో యోగ కేంద్రం గౌరవాధ్యక్షులు పప్పల రమణమూర్తి , చైర్మన్ పసుమర్తి అశోక్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, యోగా గురువులు బర్నికాన మోహన్ కుమార్, కొట్టాపు హరి కిరణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వార్డుల్లో పర్యటన

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పట్టణంలో ప్రజా పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పథకాల అమలుపై ప్రశ్నించారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే వాలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల.12 న ప్రధాని మోడీ విశాఖ పర్యటన విజయవంతానికి చోడవరం నుంచి అధిక సంఖ్యలో ప్రజల పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు జ్యోతుల రమేష్, ఒరుగంటి నెహ్రు, బొడ్డు శ్రీరామ్ మూర్తి, శ్యామ్ సుందర్, సన్యాసిరావు, దేవరపల్లి సత్య పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

నూకాంబిక హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లిలోని నూకాంబిక అమ్మ వారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఇఒ ఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జూలై 14 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు 119 రోజులకు గాను భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించగా, రూ..49 లక్షల 44 వేల 723 నగదు, 77.250 గ్రాముల బంగారం, 2,350 గ్రాముల వెండితో పాటు దుబాయ్, ఒమన్, అమెరికా, మాల్దీవులు, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, రష్యా దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారి బుద్ద లక్ష్మి నగేష్, ఇన్స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పంజా విసిరిన పులి!

నక్కవానిపాలెంలో దూడ హతం
బెంబేలెత్తుతున్న పరిసర జనం



పరిశీలిస్తున్న అటవీ అధికారులు, ఇన్‌సెట్‌లో హతమైన దూడ

ప్రజాశక్తి- సబ్బవరం : గత మూడునెలలుగా అనకాపల్లి గ్రామీణ జిల్లాలో హల్‌చల్ చేస్తున్న పులి, గురువారం వేకువజామున మళ్లీ పంజా విసిరింది. మండలంలో అసకపల్లి పంచాయతీ శివారు నక్కవానిపాలెం గ్రామంలో చిన్ని వెంకునాయుడు అనే రైతుకు చెందిన లేగ దూడను హతమార్చింది. బుధవారం రాత్రి కల్లాల వద్ద నున్న పాకలో ఆవుదూడను కట్టి ఇంటికెళ్లిన వెంకునాయుడు, గురువారం ఉదయాన్నే అక్కడకు వెళ్లి చూసేసరికి కేవలం దూడ తల మాత్రమే ఉంది. అక్కడికి సుమారు 200మీటర్ల దూరంలో నీలగిరి తోటలో సగం తిని వదిలేసిన మొండెం కనిపించింది.

గురువారం ఉదయం సున్నం బట్టీలకు చెందిన నొట్ల దేముడు అనే వ్యక్తి తన మేకలకు మేత కోసం కొమ్మలు తెచ్చేందుకు నీలగిరి తోటవైపు వెళ్లగా పులి కనిపించడం భయంతో కేకలు వేస్తూ పరిగెత్తుకొచ్చి గ్రామస్తులకు తెలిపాడు. స్థానికులు వెళ్లి చూడగా పులి గాండ్రింపులు వినబడ్డాయని, దీంతో భయపడి వెనక్కు వచ్చేశామని అంటున్నారు. బాణసంచా పేల్చి పులిని తరిమికొట్టినట్లు చెబుతున్నారు. గడచిన రెండునెల్లలో సబ్బవరం మండలంలోనే 20వరకు మూగజీవాలు పులికి బలయ్యాయని, అటవీశాఖాధికారులకు విషయం చెప్పినా సరిగా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

తెలపడంతో గ్రామస్తులు అందరూ కలిసి వెళ్లి చూడగా పులి గాండ్రింపులు వినిపించడంతో వారు కూడా భయపడే పరుగులు తీశారు.బాణసంచాలు, బాంబులు పేల్చారు.గత రెండు మూడు నెలలుగా సబ్బవరం మండలంలో గల పలు గ్రామాల్లో పులి చేసిన దాడికి సుమారు 10 నుంచి 20 జంతువులు బలయ్యాయని ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని ,తూతు మంత్రంగా వచ్చి చూసి వెళ్లిపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పులిసంచారంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని ఎంపిటిసి కర్రి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు అధికారులు చర్యలను వేగవంతం చేసి పులిని బంధించాలని కోరారు. కాగా విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కె. అప్పారావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.యాదగిరి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అటవీ హక్కుల చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-మాడుగుల: కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న అటవీ హక్కుల చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహమూర్తి, కే.భవాని డిమాండ్ చేశారు. మోడీ విశాఖ పర్యటన సందర్భంగా గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని అవురువాడ పంచాయతీ కొండవీదిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అటవీ హక్కుల చట్ట సవరణ బిల్లు రద్దు చేయకుంటే గిరిజనుల మనుగడ కష్టంగా మారుతుందని, గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. తక్షణం ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన సంఘం ర్యాలీ

అనకాపల్లి జిల్లా పరిధిలో నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని కోరారు. పోడు భూముల పట్టాలు అర్హులైన గిరిజనులకు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. గిరిజనులకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న గిరిజన సంఘం నేతలు



డ్యాన్స్ అకాడమీని ప్రారంభిస్తున్న ఆదిలక్ష్మి

యువత కళా రంగంలో రాణించాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ ఆదిలక్ష్మి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలో నీలంపేటలో జి డాన్స్ అకాడమీని మున్సిపల్ ఛైర్ పర్సన్ ఆదిలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత కళా రంగంలో రాణించాలన్నారు.డాన్స్‌లో పిల్లలు మంచి భవిష్యత్తుకు బాట వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ గొలుసు నరసింహమూర్తి, పట్టణ వైయస్సార్ పార్టీ ప్రెసిడెంట్ యాక శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శీను, సంచార జాతుల డైరెక్టర్, నీలంపేట సర్పంచ్ గంట లలిత, డాన్స్ అకాడమీ సభ్యులు పాల్గొన్నారు.

15న బహిరంగ వేలం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని పెద్దబొడ్డేపల్లి లోని గురుకుల పాఠశాలలోని కుర్చీలు, బెంచీలు, మంచాలు, వంట పాత్రలు వంటి సామగ్రిని బహిరంగ వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ సాల్మన్ రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15న మధ్యాహ్నం మూడు గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు.పిన్సిపాల్ గురుకుల పాఠశాల నర్సీపట్నం పేరుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో రూ.2,500 డీడీ రూపంలో చెల్లించి ధరావతు జమ చేయాలన్నారు. ఈ అవశాకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విభజన హామీల అమలేదీ ?

ప్రజాశక్తి-పాయకరావుపేట: మోడీ పర్యటనపై వైసిపి, బిజెపి నాటకాలు ఆడుతున్నాయని పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ తెలిపారు. పాయకరావుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడుతూ, వేల కోట్ల పనులకు ప్రారంభమంటూ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రానికి అడుగడుగునా కేంద్ర ప్రభుత్వం దగా చేస్తోందని, విభజన హామీలు అమలు చేయకుండా నాన్చివేత ధోరణి అనుసరిస్తోందని విమర్శించారు. ప్రత్యేక హెూదా ప్రస్తావనే లేదని, కడపలో స్టీల్ ప్లాంట్ నెల కొల్పకుండా విశాఖ ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేసేందుకు మోడీ కంకణం కట్టుకున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రానికి మోడీ చేస్తున్న అన్యాయంపై సీఎం జగన్ నిలదీయలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రైవేట్ పరం చేస్తుంటే సీఎం జగన్ పూర్తిగా సహకరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పోలవరం అప్పలరాజు, రాయవరం మండల ప్రెసిడెంట్ మురుకుర్తి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం పంచాయతీకి చెందిన పలువురు టిడిపి నేతలు గురువారం స్థానిక వైసిపి పార్టీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో వైసిపి పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో పెట్ల సత్తిబాబు, కొల్లి నాయుడు, కొల్లి శ్రీను, కూండ్రపు రాజేష్, కొల్లి శ్రావణ్ కుమార్, రొంగలి సతీష్ తదితరులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జడ్పిటిసి సుర్ల వెంకట గిరి బాబు, పార్టీ నాయకులు లెక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

హెటిరో పైపులైన్‌కు అనుమతులొద్దు

ప్రజాశక్తి-నక్కపల్లి:హెటిరో పైప్‌లైన్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో పైప్ లైన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన శాంతియుత మహా ధర్నా గురువారం నాటికి 345వ రోజుకు చేరింది. మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు అప్పలరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వదలడంతో మత్స్య సంపద నశించి పోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఉప్పుటేరులో టన్నుల కొద్దీ చేపలు మృత్యువాత పడ్డాయన్నారు. ఈ ప్రాంతంలో చేపల వేట సాగకపోవడంతో చాలామంది మత్స్యకారులు పొట్ట చేతబట్టి ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు భవిష్యత్తులో కూడా అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మత్స్యకార నాయకులు పిక్కి గంగరాజు, గోసల స్వామి, మైలపల్లి మహేష్‌బాబు, కోడా కాశీ, చేపల రామకృష్ణ, కారే తాతాజీ, కొత్వాల్ కాశీ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు



మాట్లాడుతున్న సర్పంచ్

మహిళల అభ్యున్నతికి సిఎం కృషి

ప్రజాశక్తి-రావికమతం: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని కవగుంట సర్పంచు దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం సర్పంచ్ సమక్షంలో వెలుగు, ఐకెపి సిఆర్‌పిలు ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ, గతంలో మహిళలు వంట ఇంటికే పరిమితమైన పరిస్థితులను చూసామని, నేడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఒఎ మహేష్ పాల్గొన్నారు.

వివాదంలో జగనన్న కాలనీ రోడ్డు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని విప్పలపాలెం పంచాయతీ జగనన్న కాలనీ రోడ్డు పనుల్లో వివాదం నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 14లో రెండు ఎకరాల 15 సెంట్ల జిరాయితీ కాలిబాటలో 17 అడుగుల రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై రైతు గొల్లు లక్ష్మీకాంతం పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా రోడ్డు నిర్మాణం నిలుపుదల చేయలేదని కోర్టును ఆశ్రయించాడు. తన భూమిని సర్వే చేసి అప్పగించాలంటూ కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నట్లు లక్ష్మీకాంతం తెలిపారు. దీనిపై అధికారులు తగు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది. దీనిపై డిటి ఆనంద్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి ఫిర్యాదు అందలేదని, ఈ సమస్యపై కోర్టు నుంచి ఫిర్యాదు అందిందని, బాధితురాలు కోర్టు ఆదేశాల ఏమైనా తగు



కాలనీ రోడ్డు ఇదే..

ఆధారాలు ఉన్నట్లయితే తమకు తెలియజేస్తే న్యాయం చేస్తామన్నారు. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ నల్లబెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వ నిధులతో రోడ్డు కల్వర్టు నిర్మాణాలు చేపట్టామని, ప్రజలు అవసరార్థం ఈ రోడ్డు చాలా అవసరమన్నారు. ఈ రోడ్డుకు ఆనుకొని జగనన్న కాలనీ నిర్మాణం జరుగుతుందని, దీనిని ఆపడానికి ప్రయత్నం చేయవద్దని తెలిపారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కోటవురట్ల:అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌డిఓ ఉదయశ్రీ తెలిపారు. గురువారం మండల స్థాయి సచివాలయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. సచివాలయ సర్వేలు అందుబాటులో ఉండకపోవడం ఆమె ఆరా తీశారు. దీనిపై స్పందించిన మండల సర్వేయర్ వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర సర్వే కార్యక్రమంలో అంతా నిమగ్నమై పని చేస్తున్నట్లు తెలిపారు.మండల వ్యాప్తంగా జరుగుతున్న జగనన్న కాలనీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఇంజనీర్ వర్మ, నీటి సరఫరా ఇంజనీర్ కరుణ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఈఓపిఆర్డి ప్రేమ్ కుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం : జెడ్‌పిటిసి గిరిబాబు

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పిటిసి సుర్ల గిరిబాబు కోరారు. గురువారం పాతమల్లంపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని గిరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అస్వస్థతకు గురైన రోగుల వద్దకు వైద్యులు వచ్చి సేవలు అందిస్తారన్నారు. ఈ విధానంపై వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అశ్విని శైలజ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

గుడ్డిపలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో కన్నూరుపాలెంకు చెందిన శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నాయుడు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఇందులో 11 మందికి కంటి ఆపరేషన్ల అవసరమని తెలిపారు. వీరిని ఆసుపత్రికి తరలించి ఆపరేషన్ చేసి స్వగ్రామానికి పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. కంటి అద్దాలు 50 శాతం రాయితీతో అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాల గణేశ్వరరావు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగనన్న లేఅవుట్లపై ఏకరువు

▶▶ నివాసాలకు అనుకూలంగా లేని స్థలాలపై పెదవి విరుపు ▶▶ మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి -నక్కపల్లి: జగనన్న లేఅవుట్లపై సభ్యులు ఏకరువు పెట్టారు. నివాసాలకు అనుకూలంగా లేని స్థలాలను కేటాయిస్తే, ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఎలా ముందుకు వస్తారని అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను హౌసింగ్ డిఇ విజేయుడు, ఏఈ రామకృష్ణలు వెల్లడిస్తుండగా సభ్యులు అడ్డు తగిలారు. జగనన్న లే అవుట్లకు సంబంధించిన సమస్యలపై అధికారులపై విరుచుకుపడ్డారు. ఎంపిటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, కుంచె మధు, మెరిగి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు మైలుపల్లి శ్రీనివాసరావు, పొడగట్ల వెంకటేశ్వరరావు, రెడ్డి వరహాలు తదితరులు జగనన్న లేఅవుట్లలో నెలకొన్న సమస్యలను లేవనెత్తారు. ఎంపిటీసీ కుంచె మధు మాట్లాడుతూ, జంతువులు నివసించే స్థావరాల్లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. పెదతీనార్ల పంచాయతీ సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపిటీసీ సభ్యులు మేరిగి నాగేశ్వరరావు మాట్లాడుతూ, సుమారుగా 38 మంది అనర్హులకు ఇళ్ల స్థలాలను కేటాయించారని, గ్రామంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అర్హులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 42 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయకుండానే, లబ్ధిదారుల జాబితాలో ఎలా ప్రకటించారని అధికారులను ప్రశ్నించారు. ఆకేటి గోవిందరావు, రెడ్డి వరహాలు మాట్లాడుతూ, అక్రమంగా విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వి కుంటున్నా అధికారులు పట్టించుకోలేదని, ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు గ్రావెల్ తవ్వకాల కోసం అనుమతులు కోరినా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టించి ఇస్తే సీజ్ చేయకుండా ఎలా వదిలేసారని ఎంపిటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు డిటి నీరజను ప్రశ్నించారు. పోలీసులకు వాహనాలను అప్పగించడం జరిగిందని ఆమె బదులిచ్చారు. నక్కపల్లి ఆర్టిసి కాంప్లెక్స్‌లోకి బస్సులు ఎందుకు రాలేదని నర్సీపట్నం ఆర్టిసి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రకాష్ ను అడగ్గా తనకు తెలియదని అనకాపల్లి ఆర్టీసీకి సంబంధించిన విషయమని బదులిచ్చారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని శివారు గ్రామాల్లో కూడా నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ పూర్తిస్థాయి సమాచారంతో హాజరయ్యే విధంగా చూడాలన్నారు. నివాసాలకు అనుకూలంగా లేని లే అవుట్ల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు మాట్లాడుతూ, గృహ నిర్మాణాల విషయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, ఎంపీడీవో సీతారామరాజు, ఉపాధ్యక్షులు వీసం నానాజీ మాట్లాడుతూ, సభ్యులు లేవ నెత్తిన సమస్యలపై వారంలో సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. లే అవుట్ల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. పలువురు సభ్యులు ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. డిఎల్ పురం ఎంపిటీసీ సభ్యులు కొండ్ర కనకారావు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ ఎంపిటీసీ సభ్యులకు నాలుగు లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని, దీంతో గ్రామం లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ , జెడ్ పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, పలువురు సర్పంచ్ లు, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపిటిసి సభ్యులు


శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి

'నాడు - నేడు' పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.31 లక్షలతో నాడు నేడు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణలు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్యామల, విద్యా కమిటీ చైర్మన్ పాము శ్రీలక్ష్మి, సర్పంచ్ కసిపల్లి అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.అప్పారావు, స్థానిక టిడిపి నాయకులు గెడ్డం నానాజీ, గెడ్డం ఆనంద్, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, విద్యా కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.


సర్వే చేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో భూముల రీ సర్వే

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆరు గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు చురుగ్గా సాగుతున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ గారా ఆనంద్ తెలిపారు. గురువారం ఆయన సర్వే జరుగుతున్న కృష్ణదేవిపేట, నాగన్నదొరపాలెం, పోలవరం గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూముల రీసర్వేతో రైతులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ చినబాబు, వీఆర్వో అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్డుపై మురుగునీరు

- అవస్థలు పడుతున్న పాదచారులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఎండపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నీరు నిత్యం ప్రవహిస్తుండటంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం పోలవరం రోడ్డు, ఎండపల్లి ప్రధాన రహదారిపై పలు చోట్ల మురుగు నీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఇప్పటికైనా స్థానిక సచివాలయ సిబ్బంది స్పందించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రధాని పర్యటనపై విజయసాయిరెడ్డి అత్యుత్సాహం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: ఈ నెల 12న ప్రధాని మోడీ విశాఖ పర్యటనపై ఎంపీ విజయసాయిరెడ్డి అతి ఉత్సాహంతో చూపిస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. గురువారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఈ సభలకు ప్రతీ ని యోజకవర్గం నుంచి 2 నుంచి 3వేల మంది డ్వాక్రా మహిళలను తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రధాని సభలో ఈ డ్వాక్రా మహిళలతో మూడు రాజధానులపై స్లోగన్ చెప్పించడానికి సిద్ధం చేస్తున్నారన్నారు. దీనిపై బిజెపి నాయకులు కలుగజేసుకోవాలన్నారు ఇటీవల 53 మంది డిఎస్పీలకు పోస్టింగులు, బదిలీలు ఇచ్చారని ముఖ్యమైన స్థానాల్లో 12 మందికి రెడ్డి కులస్తులకే ఇచ్చారని, ఇది అన్యాయమన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, హోంమంత్రి సమాధానం చెప్పాలన్నారు. సివిల్ సప్లై మంత్రి, కాకినాడ ఎమ్మెల్యే ద్వారపూడి చంద్రశేఖర్‌ల సహకారంతో కేంద్రం పేదలకు ఇస్తున్న బియ్యాన్ని తరలిసన్నారంటే ఎంత ఘోరం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చునన్నారు. గతంలో కేంద్రం ఇచ్చిన 5లక్షల 70వేల టన్నుల బియ్యానికి లెక్కలు లేవని కేంద్ర మంత్రి చెప్పారని, ఆ బియ్యమంతా ఏమైపోయాయని అయ్యన్న ప్రశ్నించారు.


మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

మండల స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో టౌన్ ఎస్సై గోవిందరావు, మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ చేతుల మీదుగా మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై గోవిందరావు మాట్లాడుతూ, క్రీడలు ఆడటంతో మానసిక ఉల్లాసం శారీరకదారుఢ్యం కలుగు తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించడం ఎంతో ఆనందదాయకమన్నారు. వివిధ ఉద్యోగాలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి సాయి శైలజ మాట్లాడుతూ, మండల స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో నర్సీపట్నంకు గుర్తింపు తీసుకు రావాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో పిడి కె.వరహాల బాబు, శాప్ కోచ్ అబ్బు, నింజాస్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, డైరెక్టర్ జగన్నాథ్, అడిగర్ల సతీష్, బోలెం శివ, పీడీలు రవి, ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు పోటీల ఎంపికలు

నాతవరం : మండల స్థాయి సీఎం కప్ పోటీల ఎంపికలు ఈనెల 11న శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగు తాయని స్థానిక ప్రధానోపాధ్యాయులు శివరాం ప్రసాద్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ మండల స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ క్రీడల్లో ఎంపికైన జట్లు నియోజకవర్గం స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేడు నియోజకవర్గ స్థాయి పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం సీఎం నియోజకవర్గ స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించ నున్నట్లు పాయకరావుపేట నియోజక వర్గం క్రీడల ఇన్చార్జ్ కుందూరు రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 17 సంవత్సరాలు పైబడిన వారికి కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ సెలెక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాలకు సంబంధించి నక్కపల్లిలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఈ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా దుస్తులు ధరించి, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.


నర్సీపట్నంలో పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ